# పంటకు ప్రభుత్వం భరోసా

- ప్రతి ఏడాది రెండు సీజన్లలో మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో తొమ్మిదేండ్లుగా ఏటికేడు పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి
- ఈ వానకాలం సీజన్‌లో 11.54 లక్షల ఎకరాల్లో వరిసాగు
- స్థానిక అవసరాలు పోను 10 లక్షల మెట్రిక్ టన్నులు మార్కెట్‌కు వచ్చే అవకాశం
- ధాన్యం కొనుగోలుకు ఉమ్మడి జిల్లాలో 746 పీపీసీ కేంద్రాలు


అర్వపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం

నల్లగొండ, నవంబర్ 7: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తూ తొమ్మిదేండ్లుగా కొనుగోలు చేస్తున్నది. ఓ వైపు ప్రతి ఎకరాకు రూ.10వేల చొప్పున పంట పెట్టుబడి సాయం అందిస్తూనే మరోవైపు మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తున్నది. 2014 వానకాలం సీజన్ నుంచి మొదలు ఈ సంవత్సరం వానకాలం సీజన్ వరకు కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తున్నది. నాడు 61వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనగా నేడు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నది. ప్రతి సీజన్‌లో ప్రభుత్వరంగ సంస్థలైన పీపీసీఎస్, ఐకేపీతో పాటు మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేస్తుండగా.. సివిల్ సప్లై యంత్రాంగం రైతులు ధాన్యం విక్రయించిన పక్షం రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలీన్లు, తేమ కొలిచే, తూకం యంత్రాలను మార్కెటింగ్, సివిల్ సప్లై శాఖలే సమకూరుస్తున్నాయి. రైతు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళితే ప్రభుత్వ రంగ సంస్థలే కొనుగోలు చేసి డబ్బులు ఖాతాల్లో జమ చేస్తున్నాయి. దాంతో దళారుల ప్రమేయం పూర్తిగా పోయింది.

### తొమ్మిదేండ్లలో 9.10 లక్షల ఎకరాల్లో పెరిగిన సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గడిచిన తొమ్మిదేండ్లలో 9.10 లక్షల ఎకరాల్లో వరి సాగు పెరిగింది. 2014లో యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,44,687 ఎకరాల్లో వరి సాగు చేయగా ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 13,54,750 ఎకరాల్లో వరి సాగైంది. నాడు హెక్టారుకు 6.25 మెట్రిక్ టన్నుల చొప్పున 11,11,718 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కావాల్సి ఉండగా సాగు నీటి వనరులు సరిగ్గా లేక 60 శాతం మాత్రమే పంట దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 71 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టగా స్థానిక అవసరాలు పోను 61 వేల మెట్రిక్ టన్నులు మార్కెట్‌కు రావటంతో ప్రభుత్వం రూ.26.29 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. 2023 యాసంగి సీజన్‌లో జిల్లాలో 13,54,750 ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం పుష్కలంగా నీటి వనరులు ఉండటంతో ఒక్క గుంట వరిపైరు కూడా ఎండిపోలేదు. ఫలితంగా 33,85,875 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఇందులో స్థానిక అవసరాలు పోను 12.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తే 746 కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.2,255 కోట్లు వెచ్చింది రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోలు చేసి ఎగుమతి చేసిన వారం, పది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది.

### ముమ్మరంగా వానకాలం ధాన్యం కొనుగోళ్లు

ప్రస్తుతం వానకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11, 54,750 ఎకరాల్లో వరి సాగు చేయగా 28,86,875 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో మిల్లర్ల కొనుగోలు, స్థానిక అవసరాలు పోను ప్రభుత్వ రంగ మార్కెట్లకు 10.55 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఈ ధానాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొనుగోళ్ల సమయంలో రైతుల ఆధార్ కార్డును లింక్ చేసి బయోమెట్రిక్ వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 746 ఐకేపీ, పీఏసీఎస్, మార్కెటింగ్ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. టార్పాలిన్లు, తేమ యంత్రాలు, ప్యాడీక్లీనర్లు, తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు, మార్కెటింగ్, సివిల్ సప్లై శాఖలు సమకూర్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి క్వింటా ధాన్యానికి మద్దతు ధర ఏ గ్రేడ్ అయితే రూ.2,203, కామన్ అయితే రూ.2,183గా నిర్ణయించి కొనుగోలు చేస్తున్నది.

### 10 శాఖల భాగస్వామ్యం

జిల్లా వ్యాప్తంగా ప్రతి సీజన్‌లో10 నుంచి 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు వస్తున్నాయి. ఈ ధాన్యం కొనుగోలు చేసేందుకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఐకేపీ, సహకారశాఖ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌లు జిల్లా వ్యాప్తంగా 675 నుంచి 750 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనేది మూడు శాఖలు అయినా ప్రక్రియ మాత్రం 10 శాఖలు నిర్వర్తిస్తున్నాయి. ఈ సారి ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగకుండా ఉండేందుకు, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చూసేందుకు ప్రతి రైతు ఆధార్ కార్డును లింక్ చేసి బయోమెట్రిక్ చేసిన తర్వాతనే ధాన్యం తూకం వేసి కొనుగోలు చేస్తున్నారు.

### ఓ వైపు ఎన్నికల విధులు.. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర అందించి సకాలంలో కొనుగోలు చేయడంలో అధికారులు కృషి చేస్తున్నారు. సుమారు రెండున్నర నెలల పాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తుంటారు. ఈ సారి సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఒక వైపు ఎన్నికల విధులు నిర్వహిస్తూనే.. మరోవైపు ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాల్సి వస్తున్నది. ఇందులో సివిల్ సప్లైతో పాటు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, సహకార శాఖలు ఎక్కువగా శ్రమించాల్సి వస్తున్నది.

### రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు



వానకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు ఇబ్బంది లేకకుండా చర్యలు తీసుకుంటున్నాం. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. దీనిని డీఆర్డీఏ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేందుకు 274 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే గన్నీ బ్యాగులు, తేమ, తూకం యంత్రాలు సమకూర్చాం. ప్రస్తుతం ఎన్నికల విధులు ఉన్నప్పటికీ రైతులకు ఇబ్బంది కలుగవద్దనే కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగేలా చేస్తున్నాం.

–వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి, నల్లగొండ

## జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలి

- పశువైద్యాధికారి గోపి

సూర్యాపేట రూరల్, నవంబర్ 7 : గొర్రెలు, మేకల పెంపకందారులు తమ జీవాలకు పీపీఆర్ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి గోపి సూచించారు. మంగళవారం పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేసి మాట్లాడారు. జీవాలకు పారుడు రోగం రాకుండా వ్యాక్సిన్ వేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, శరత్‌చంద్రప్రసాద్, పరమేశ్ పాల్గొన్నారు.


పిల్లలమర్రిలో గొర్రెలకు పీపీఆర్ టీకాలు వేస్తున్న పశువైద్యాకారి గోపి


సూర్యాపేటలో కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## ప్రజలే మా బలం.. అభివృద్ధే మా ధ్యేయం

- ప్రశాంతతతో కూడిన నిరంతర ప్రగతికి పట్టం కట్టాలి
- పదేండ్లలో అద్భుతమైన అభివృద్ధి సాధించుకున్నం
- పెంచుకున్న సంపదను దోచుకునేందుకు వస్తున్నారు
- అరాచక శక్తులకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- మంత్రి, బీఆర్‌ఎస్ సూర్యాపేట అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో పలు సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు
- కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురి బీఆర్‌ఎస్‌లో చేరిక

సూర్యాపేట టౌన్, నవంబర్ 7 : ముఖ్యమంత్రి కేసీఆర్ నాయత్వంపై కొండంత నమ్మకంతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గత రెండు దఫాలుగా ఆశీర్విదిస్తూ అభివృద్ధికి పట్టం కట్టి, మరోమారు గెలిపించేందుకు అడుగడుగునా ఆదరిస్తున్న అన్ని రంగాల ప్రజలే తమ బలమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రశాంతతో కూడిన నిరంతర అభివృద్ధికే మరోమారు పట్టం కట్టాలని కోరారు. అరవై ఏండ్లకు పైగా ఆగమైన తెలంగాణలో పదేండ్ల పాలనలోనే అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించుకున్నామని.. మరోమారు అంతా ఆశ్వీరదిస్తే మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. మంగళవారం సూర్యాపేటలో జరిగిన ఆయా సంఘాల ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొనడంతో పాటు కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి మాట్లాడారు. విపక్షాల కుట్రలు చేదిస్తూ గత పదేండ్లుగా పెంచుకున్న సంపదను దోచుకునేందుకు అభివృద్ధి నిరోధకులు కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల ముసుగులో వస్తున్నారని.. అరాచక శక్తులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని ఆపలేరన్నారు. యావత్ దేశంలోనే మరెక్కడా లేని విధంగా బీఆర్‌ఎస్ పాలనలో సంచలనాత్మకంగా కొనసాగుతున్న ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, కేసీఆర్ కిట్, అమ్మ ఒడి, నిరంతర విద్యుత్, పుష్కలంగా సాగు, తాగు నీరు, రోడ్లు, ఆత్మగౌరవ భవనాలు, మెరుగైన విద్య, వైద్యం ఇలా అనేక రకాల అభివృద్ధి, సంక్షేమాలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవిస్తున్నట్లు చెప్పారు. గతంలో రౌడీ రాజకీయాలకు, సిండికేట్ దందాలతో, గొడవలు, కొట్లాటలతో భయానక వాతావరణంలో ఎంతో మంది ప్రజలు, వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులను ఇక్కడి ప్రజలెప్పటికీ మర్చిపోలేరన్నారు. అలాగే అనేక కుటుంబాలు బతుకుదెరువు కోసం వలసలు వెళ్లిన ఘటనలు కండ్లచూసినట్లు తెలిపారు. అటువంటి భయానక వాతావరణంలో బతికిన జనం 2014 నుంచి పెరిగిన ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జీవించడంతో పాటు వ్యాపారులు తమ వ్యాపారాలను ప్రశాంతంగా కొనసాగించుకుంటున్నట్లు వివరించారు. అంతేకాకుండా సూర్యాపేటలో అనేక వస్త్ర, వ్యాపార సంస్థలు, మాల్, మల్టీప్లెక్స్‌లు ఏర్పాటు అవుతుండడంతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అనేక రకాల మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఐటీ హబ్ ఏర్పాటుతో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. ఇంకా వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐటీ హబ్‌ను విస్తరించడంతో పాటు అనేక పరిశ్రమల ఏర్పాటుకు బడా వ్యాపారస్తులు ముందుకు వస్తున్నారన్నారు. ఇలా అన్ని రకాలుగా ప్రశాంత పాలనలో నిరంతర అభివృద్ధి, సంక్షేమాలను కొనసాగించుకునేందుకు అన్ని రంగాల ప్రజలంతా ఏకమై బీఆర్‌ఎస్ పార్టీని మరోమారు ఆశీర్వదించి హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు, ఆయా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 22 నామినేషన్లు

సూర్యాపేట, నవంబర్ 7 : జిల్లా వ్యాప్తంగా మంగళవారం 22 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ తెలిపారు. హుజూర్‌నగర్ నియోజక వర్గానికి గంగిరెడ్డి కోటిరెడ్డి(స్వతంత్ర), తండు ఉపేందర్(స్వతంత్ర), జాజుల శ్రీకాంత్(స్వతంత్ర) నామినేషన్ దాఖలు చేశారు. కోదాడ నియోజక వర్గంలో బెల్లంకొండ నవీన్(స్వతంత్ర), డాక్టర్ మల్లెబోయిన అంజనేయులు(ఆల్ ఇండియా ఫార్వడ్ బ్లాక్), లింగిడి వెంకటేశ్వర్లు(ప్రజావాణి), పిట్ల సైదులు(స్వతంత్ర) ఒక్కో నామినేషన్ వేయగా షేక్ అబ్దుల్ మాలిక్(ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్) పార్టీ తరుపున రెండు నామినేషన్ సెట్లు వేశారు. సూర్యాపేట నియోజక వర్గంలో లింగిడి వెంకటేశ్వర్లు(ప్రజావాణి), చెరుకు కిరణ్‌కుమార్(డీఎస్పీ), వీరాకుమారి మచ్చ(డీఎస్పీ), గుడిపల్లి మధుకర్‌రెడ్డి(యువ తులసి పార్టీ), ముప్పాని లింగారెడ్డి(స్వతంత్ర) ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేయగా మర్రి నెహేమియా(స్వతంత్ర) రెండు సెట్లు, పల్లేటి రమేశ్(బహుజన ముక్తి) రెండు నామినేషన్ సెట్లు వేయడం జరిగింది. తుంగతుర్తి నియోజక వర్గంలో గుడిపాటి నర్సయ్య(కాంగ్రెస్) నుంచి, ఇండిపెండెంట్‌గా మరో సెట్ వేయడం జరిగింది. ఎదుల వీర పాపయ్య ఎంసీపీఐ(యూ), దేవరకొండ జానయ్య(రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా) నామినేషన్ వేశారు.